క్లుప్తంగా

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని స్టీల్ ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ప్లాంట్ ను మాటపై నిలబడి పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.

రసాయన శాస్త్రంలో డాక్టరేట్


షేక్ సుల్తానా

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర పరిశోధకురాలు షేక్. సుల్తానాకు వై.వి.యు డాక్టరేట్ ప్రకటించింది. రసాయనశాస్త్ర శాఖ ఆచార్యులు ఎన్.సి. గంగిరెడ్డి పర్యవేక్షణలో ''డి.పై.ఎ.టైప్ స్మాల్ ఆర్గానిక్ మాలిక్యుల్స్ ఫర్ ఆప్టోఎలక్ట్రానిక్ అప్లికేషన్'' అనే అంశం పైన పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. ఈ మేరకు వై.వి.యు పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్వీ. కృష్ణారావు డాక్టరేట్ నోటిఫికేషన్ జారీ చేశారు. షేక్ సుల్తానా రాసిన 8 పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించారు. డాక్టరేట్ అందుకున్న షేక్ సుల్తానాను వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి. శ్రీనివాస్, రసాయన శాస్త్ర శాఖ అధ్యాపకులు అభినందించారు.

ఎంఈఓలకు సన్మానం


ఎంఈఓలను సన్మానిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప మండలం నూతన ఎంఈఓ- 1 గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రఫీక్ అహ్మద్‌తోపాటు ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్ లను బుధవారం కడప ఎంఆర్సీలో రూట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూట రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్, జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్‌లు మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాలైన బీడీ కాలనీ, భగత్ సింగ్ నగర్, సాగర్ కాలనీలలో నూతన ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్తార్ ఫైజి, హాజీ అబ్దుల్ హకీమ్, అఫ్జల్ బాషా, మస్తాన్ వలి, ఖదీర్ పర్వేజ్, ముహమ్మద్ అయూబ్, ముహమ్మద్ ఇర్షాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా, నగర ఆర్థిక కార్యదర్శి నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

నగదు వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని జెడ్పీ కాంప్లెక్స్‌లో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సుబాన్‌బాషా రూ. 10 వేలు వితరణగా అందించారు. తన జన్మదిన సందర్భంగా ఈ సాయం చేసినట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, షంషీర్, వసతి గృహం నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉంది. ఈనెల 27వ తేదీన మహిళ తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా


మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా ఆరోపించారు. మైదుకూరు పట్టణంలోని 23వ వార్డు ఇందిరమ్మ కాలనీలో బుధవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంజాద్‌బాషా, శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. ఆయన ప్రజలకు చేసిన మోసాన్ని ఎండగట్టారు. అర్హత ఉండి పింఛన్ రాని వారితో మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను కాలనీ వాసులకు గుర్తు చేయగా తమకు ఎలాంటి పథకాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు 143 హామీలను ఇచ్చారని, అందులో ముఖ్యమైనవి సూపర్ సిక్స్‌గా పేర్కొన్నారని, ఏ ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని, మొన్నటి ఎన్నికల్లో ఆయన ఇచ్చిన హామీలను ప్రజలు ఆశతో నమ్మారన్నారు. వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతులకు, డ్వాక్రా మహిళలకు, టైలర్లకు, ఆటో డ్రైవర్లకు, నాయీ బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండానే ప్రభుత్వ పథకాలను అందుకునేలా సేవలందించారన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పారని, 14 నెలల్లో ఒక్కొక్కరికి రూ.42 వేలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారికి రూ.1500 ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని విమర్శించారు. నాలుగు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కటి ఇచ్చారని, చాలామంది ఖాతాల్లో ఆ డబ్బు పడలేదని ఆరోపించారు. ఉచిత బస్సు అని చెప్పి.. బస్సెక్కి డ్రైవర్‌కు తన పేరు చెప్పాలని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రైతులకు రూ.20వేలు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 66 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా, చంద్రబాబు వచ్చి రాగానే ఐదు లక్షల మందికి కోత పెట్టారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పథకాలు ఇవ్వకపోయినా కరెంటు బిల్లులు పెంచారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద పాఠశాలలు బాగుపడ్డాయని, విద్యార్థులకు అందించిన బ్యాగ్‌లు నెలకే చినిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లోనైనా మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్ జగన్‌తోనే..

సంక్షేమం, అభివృద్ధి అనేవి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో ప్రజలకు చంద్రబాబు పట్టం కట్టారని, ఆశ చెడ్డది కాబట్టే ప్రజలందరూ చంద్రబాబు హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కి పథకాలకు మంగళం పాడారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఆడ బిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇవ్వగా ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ఓ మంత్రి చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా కులాలు, మతాలు, పార్టీలకతీతంగా పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అమలయ్యేలా చేశారని కొనియాడారు. వైఎస్ హయంలో ఇందిరమ్మ కాలనీలు, జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జగనన్నకాలనీలు నిర్మించగా ఎక్కడైనా చంద్రబాబు కాలనీ అనేది ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వార్డు ఇన్‌చార్జి ఎస్.ఖాదర్‌బాషా, నాయకుడు షేక్ ఖాదర్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, భరత్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఏపీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు అన్నలూరు శ్రీనివాసులరెడ్డి, గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, గోశెట్టి లక్ష్మయ్య, రైతు విభాగం నాయకుడు నాగిరెడ్డి, భూమిరెడ్డి సుబ్బరాయుడు, మైనారిటీ నాయకులు ఖాదర్, ట్రాక్టర్ గౌస్, మాబు చాన్, జమాల్, కందనూరి షరీఫ్, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష పార్టీల ప్రజా సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో కబ్జాదారుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిల పక్ష పార్టీల ప్రజాసంఘాల నేతలు రామమోహన్, ఎస్ఎసత్తార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు, స్థలాలను ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న కబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో రెవెన్యూ, కార్పొరేషన్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ మేరకు అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. కడప నగరంలో దాదాపు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బదలాయింపు జరిగిందని, దీని మీద సమగ్ర విచారణ జరిపించాలన్నారు. భూకబ్జాదారులకు రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు పెద్ద ఎత్తున సహకారం అందించడం వల్లనే ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మవుతున్నాయని వారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, కుమార స్వామి రెడ్డి, ఓబయ్య, మగ్బుల్ బాషా, రమణయ్య, డబ్ల్యూ రాము, సుబ్బరాయుడు, నాగేంద్రకుమార్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు నరసింహ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్‌బాష

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపునకై ఆగష్టు 2వ తేదీ ధర్నా నిర్వహిస్తున్నామని, ఈ ధర్నాను విజయవంతం చేయాలని కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఇలియాస్ బాషా, జనరల్ సెక్రటరీ రాళ్ళపల్లి అబ్దుల్లా కోరారు. బుధవారం కడప ఎస్టీయూ భవన్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో పని చేసే ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుండి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బోధనను హరించే యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికై ఆగస్టు 2వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్నాకు ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. పి-4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదని కోరారు. ఈ సమావేశంలో ఎం.విజయకుమార్ (యు.టి.ఎఫ్), ఎన్.సంగమేశ్వర్ రెడ్డి (ఎస్.టి.యు) ఖాదర్ బాషా (ఏ.పి.టి.ఫ్ 257), యం.వి సుబ్బారెడ్డి (హెచ్.ఎమ్.ఏ), రాష్ట్ర జిల్లా నాయకులు సురేష్ బాబు, మహేష్ బాబు, రామచంద్ర రెడ్డి, రామమోహన్, శివారెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీమ మాండలికానికి జీవం పోసిన కథకుడు 'పులికంటి'

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ మాండలికాన్ని కథల్లో చొప్పించి ప్రాంతీయ భాషకు జీవం పోసిన కథకుడు 'పులికంటి కృష్ణారెడ్డి' అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం డా. పులికంటి కృష్ణారెడ్డి 95వ జయంతిని నిర్వహించారు. ముందుగా పులికంటి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ పులికంటి పాటలు, రచనలు, కథలను వివరించారు. ఆయన సాహితీకృషిని గుర్తించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 2005లో ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర 28వ మహాసభలు ఒంగోలులో ఆగస్టు 20 నుండి 25 తేది వరకు జరుగుతున్నాయని, 23వ తేదీన జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభకు భారీగా తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ సంస్థాగతంగా శాఖలు, మండలాలు, పట్టణాలు, నగరాలు ఏరియాలు, జిల్లాల మహాసభలు పూర్తి చేసుకొని ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ ఉద్యమం, ప్రస్తుత రాజకీయ, సామాజిక సమస్యలపై చర్చించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి యన్.వెంకట శివ, సీనియర్ నాయకులు టక్కోలి మనోహర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి లు మద్దిలేటి, శంకర్ నాయక్, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : 2003న నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు జరిగేలా చూడాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయ ఫోరం వైఎస్సార్ జిల్లా కన్వీనర్ గజ్జుల తిరుపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకట శివారెడ్డి, టీడీపీ నేత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన


పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న వైవీయూ వీసీ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. కడప ఎర్రముక్కపల్లెలోని సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వెనక భాగంలో రూ.3.6 కోట్లతో నిర్మితమవుతున్న నూతన భవన నిర్మాణ పునాది పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉపకులపతి పనుల నాణ్యతను పరిశీలించారు. సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ ఉపకులపతితో పాటు ఉన్నారు.

ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పాలెం గురుమూర్తి రెడ్డి, జిల్లా నైపుణ్య అధికారి విజయ్ వినీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చిన అనంతరం ఉపాధి కల్పించడం ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని వారు వివరించారు. మరిన్ని వివరాలకు 8886297300 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మనోహర్

కడప అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే 'ప్రపంచ వ్యక్తి అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా కడప నగరంలో గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది మనోహర్ మాట్లాడుతూ వ్యక్తుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కువగా పిల్లలు మహిళలు అక్రమ రవాణాకు గురి అవుతున్నారన్నారు. పలు చట్టాలు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రవితేజ, ఇంటర్మీడియట్ రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిస్టిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్మెంట్ అధికారి రమాదేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, దిశా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాష, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన యోగి వేమన విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక అయినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వరరెడ్డి ప్రకటించారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల అంగీకారం మేరకు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా వృక్ష శాఖ ఆచార్యులు ఎ. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎమ్ ఎమ్ వినోదిని, ఉపాధ్యక్షులుగా ఆచార్య ఎల్ మాధవి, డాక్టర్ వి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె. మృత్యుంజయరావు, కోశాధికారిగా డాక్టర్ జయంతి కాశ్యప్‌ను ఎన్నుకున్నారు. పాలక మండల సభ్యులుగా డాక్టర్ ఎ.శ్రీధర్ బాబు, ఆచార్య మెర్సీ విజేత, డా.వి.వి. వెంకట్రాము, డాక్టర్ వర ప్రభాకర్, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ గణేష్ నాయక్, డాక్టర్ వి.లాజర్, డాక్టర్ గంజి పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రొద్దుటూరులోని వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుల నుండి ఒక సంయుక్త కార్యదర్శి, ఒక పాలక మండల సభ్యులు ఉంటారని తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ల కాల పరిమితితో పనిచేస్తాయన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగ సుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే కార్మిక సంక్షేమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, నేడు ఆ హామీ మరిచిపోయి కార్మికులను అణగదొక్కే నిర్ణయాలు చేపడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు ఛార్జీలు తదితర భారాలు మోయలేక కార్మిక కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నాయని తెలిపారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 5న కడప విద్యుత్ భవన్ ఎస్ ఇ కార్యాలయం వద్ద జరగబోయే ఆందోళన కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి. బాదుల్లా, ఉపాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, మంజుల, చాంద్ బాషా, సహాయ కార్యదర్శులు మద్దిలేటి, లింగన్న, మస్తాన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ విద్యార్థులకు వసతి దీవెన నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టి వైఎస్ఆర్ పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించగా, అమ్మ ఒడి ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరాను వైఎస్ జగన్ కల్పించారన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1700కోట్లను ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీర్చిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం గత బకాయిలతోపాటు రూ.6200కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ నిధులను విడుదల చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖామంత్రి లోకేష్ ఇప్పటికి 4 సార్లు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారని, ఇంతవరకూ విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో వసతులు దారుణంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఎన్నారైలు


వైఎస్ జగన్‌కు దుబాయ్, కువైట్‌లో చేస్తున్న కార్యక్రమాల గూర్చి వివరిస్తున్న సాంబశివారెడ్డి, ఇలియాస్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దుబాయ్, కువైట్‌కు సంబంధించిన ఎన్నారైలు కలిశారు. బుధవారం విజయవాడ తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ ఏ. సాంబశివారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్‌లతో కలిసి వారు వైఎస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లో వైఎస్సార్ సీపీ కమిటీ సభ్యులు పార్టీ అభ్యున్నతికి చేస్తున్న పనుల గూర్చి ఆయనకు వివరించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో దుబాయి, కువైట్ కో కన్వీనర్లు సయ్యద్ అక్రం, షా హుస్సేన్, దుబాయి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు గూడూరు కోటేశ్వర్ రెడ్డి, షేక్ అబ్దుల్లా, ఉమైర్ లు ఉన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ప్రొద్దుటూరు : ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిలబెట్టుకోవాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) ఏరియా ప్రధాన కార్యదర్శి పూసల చిన్న ఓబన్న డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరు పెయింటర్స్ యూనియన్ సమావేశం మేస్త్రీలు నాగేంద్ర, సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న ఓబన్న మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంక్షేమ బోర్డును ప్రారంభించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టామన్నారు. ఈమేరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు పోస్టుకార్డులను పంపినట్లు తెలిపారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆగస్టు 30, 31 వ తేదీలలో కడపలో జరుగుతున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ మూడవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటియుసి జిల్లా కార్యాలయంలో యూనియన్ నగర సమితి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి. అనసూయ, కోశాధికారి సి. అమ్ములు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.లక్ష్మీనరసమ్మ, బి. శాంతమ్మ నాయకులు సి. అనసూయ, రాణి, విజయలక్ష్మి, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.